

# మరో మనువు కథ

వీరభద్రరావు పమ్మి

కింద ఫ్లోర్లో ఏదో హడావుడిగా ఉంటే శకుంతల తన ఫ్లాట్లోంచి బైటకి వచ్చింది. తన ఫ్లాట్ ముందు నుంచి వెడుతున్నతన్ని "ఏమిటి కింద గొడవ?" అనడిగింది.

"కింద ఫ్లోర్లో ముప్పైరెండో ఫ్లాట్లో ఉండే కుర్రాడు ఆత్మహత్య చేసుకోడానికి ప్రయత్నించాడు. పోలీసులు వచ్చారు."

శకుంతల కళ్ళ ముందు ముప్పై రెండో ఫ్లాట్ కుర్రాడి మొహం లీలగా కదిలింది. ఆమె మెట్లు ఎక్కి తన ఫ్లాట్‌కి రావాలంటే కింద ఫ్లోర్లో అతని ఫ్లాట్ మీదుగా రావాలి. ఆమె అతన్ని చాలాసార్లు చూసింది.

ఉంగరాల జుట్టుతో, చిన్న మీసకట్టుతో, మెరిసే కళ్ళతో, ముందుకి ఉబికి వచ్చిన ఛాతితో చాలా ఆకర్షణీయంగా ఉంటాడు. అతను ఎదురుపడినపుడల్లా శకుంతల అతని కళ్ళలోకి చూసేది. ఒకోసారి వెనక్కి తిరిగి మరీ చూసేది.

వెన్నెల తాగినట్టు అంత హుషారుగా ఉంటే అతనికి ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరం ఏమొచ్చిందో ఆమెకి అర్థం కాలేదు.

ఆమె హడావుడిగా కింద ఫ్లోరుకి వెళ్ళింది. అపస్మారక స్థితిలో ఉన్న అతన్ని చుట్టుపక్కల వాళ్ళు చేతుల మీద మోసుకుని అంబులెన్స్ దగ్గరికి చేర్చారు. పక్కనే పోలీసులు ఉన్నారు.

అసలేం జరిగిందో తెలుసుకోడానికి ఆమె ప్రయత్నించింది.

ఆ కుర్రాడు ఒంటరిగా ఆ ఫ్లాట్లో ఉంటాడు. ఆ రోజు పొద్దునే పని మనిషి కాలింగ్ బెల్ నొక్కితే అతను తలుపు తియ్యలేదు. మరో గంట తర్వాత ఆమె మళ్ళీ కాలింగ్ బెల్ మోగించింది. అతను తలుపుతియ్యలేదు. పని మనిషి పక్క వాళ్ళకి చెప్పింది. వాళ్ళూ ప్రయత్నించారు. లాభం లేకపోయింది. పోలీసుల్ని పిలిచారు.

ఆ కుర్రాడి బెడ్‌రూంలో ఖాళీ నిద్రమాత్రల సీసా కనిపించింది.

విషయమంతా విన్న శకుంతలకి మనసు కకావికలం అయింది. తన ఆత్మబంధువుకేదో ప్రమాదం జరిగిందన్న భావం కలిగింది. ఆమె వెంటనే తయారై ఒక్కతే హాస్పిటల్‌కి వెళ్ళింది. సాయంత్రానికి అతనికి తెలివొచ్చింది.

డాక్టర్ పర్మిషన్ తీసుకుని ఆమె అతన్ని కలిసింది.

"దయుంచి ఈ విషయం మా వాళ్ళెవరికి తెలియకుండా చూడండి." అతను చేతులు జోడించి ప్రార్థించాడు.

ఆమె సరేనంది.

అతను హాస్పిటల్లో ఉన్నన్నాళ్ళు అతనికామె సేవ చేసింది. కావల్సిన సహాయ సహకారాలు అందించింది. పోలీసుల్ని కలిసి వాళ్ళకిచ్చేదేదో ఇచ్చేసి కేసు లేకుండా చూసింది. అతను పూర్తిగా కోలుకున్నాక తన ఫ్లాట్‌కి తీసుకొచ్చింది.

"ముక్కు మొహం తెలియని వాణ్ణి - మీకిదంతా నాకెందుకు చేస్తున్నారో నాకర్థం కావడం లేదు" అని అతను అన్నపుడల్లా ఆమె నవ్వి ఊరుకునేది. అతను శారీరకంగా పూర్తిగా కోలుకున్నాడు. అతను మానసికంగా పూర్తిగా కోలుకోవడానికి కావల్సిన సహాయం ఆమె అందిస్తోంది.

* * *

అతని పేరు రవికిరణ్.

ఓ ప్రైవేట్ కంపెనీలో ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు.

తల్లిదండ్రులు కృష్ణాజిల్లాలో ఉంటారు. బాగా ఆస్తిపరులు. అతను తన కంపెనీలో పని చేస్తున్న మాధవీలతను ప్రేమించాడు. ఇద్దరూ సినిమాలకి, షికార్లకి, పార్కులకి వెళ్ళారు. ఒకర్నొకరు గాఢంగా ప్రేమించుకున్నారు.

అతనామెకు ఎన్నో కానుకలు, బహుమతులు ఇచ్చాడు.

పెళ్ళి చేసుకోవాలని ఇద్దరూ అనుకున్నారు. ఊసులాడుకున్నారు, బాసలు చేసుకున్నారు.

వాళ్ళ ప్రేమ జీవితం మూడు చందమామల్లా, ఆరు నక్షత్రాల్లా సాగిపోతోంది.

మరి కొన్నాళ్ళు గడిచేసరికి వాళ్ళ ప్రేమను రాహువు మింగేసాడు.

మాధవీలతను దూరపు చుట్టాల కుర్రాడు పెళ్ళి చేసుకోడానికి అమెరికా నుంచి వచ్చాడు. ఆమె ప్రేమ విషయం తెలియని తల్లిదండ్రులు అమెరికా కుర్రాడికి ఆమె ఫోటో చూపించారు.

అతను అమెరికా కుర్రాడు కదా - ఆలస్యం చెయ్యకుండా అర్జంటుగా ఓ.కె. అన్నాడు. తల్లిదండ్రులు మాధవీలత అభిప్రాయం అడిగారు.

ఓ పక్కన అమెరికాలాంటి భూతల స్వర్గంలో స్థిరపడి లక్షలు లక్షలు సంపాదిస్తున్న కుర్రాడు...

మరో పక్క అమీర్‌పేటలో ఉద్యోగం చేస్తున్న రవికిరణ్...

ఆమె మనసులో త్రాసు అటు ఇటు కదిలింది.

కదిలి అమెరికావైపు మొగ్గు చూపింది.

ఒకసారి కాదు - రెండుసార్లు కాదు - మాధవీలత అనేకసార్లు త్రాసుని కదిపి చూసింది. ప్రతీసారి త్రాసు అమెరికా వైపే మొగ్గు చూపింది.

చివరికామె రవికిరణ్‌తో "సారీ బాస్" అంది.

అతనామెను బతిమాలాడు - బామాలాడు. గెడ్డం పెంచుకున్నాడు. ఆమె మనసు మారలేదు.

పెళ్ళి చేసుకుని మొగుడితో అమెరికా వెళ్ళిపోయింది. ముందు ఆమెను ద్వేషించాలని, తర్వాత ఆమెను మర్చిపోవాలని అతను చేసిన ప్రయత్నం ఫలించలేదు.

ఆమె లేని జీవితం జీవితం కాదనిపించడతనికి - ఆత్మహత్యా ప్రయత్నం చేసాడు.

* * *

అతని కథ విన్న శకుంతలకి అతని మీద జాలేసింది. అతని ప్రేమ హృదయం మీద ముచ్చటేసింది.

అతనిలా మనస్ఫూర్తిగా, హృదయ పూర్వకంగా ఓ మనిషిని ప్రేమించిన మనుషులు - మానవలోకాన్నే ప్రేమిస్తారు. అంత సున్నిత హృదయులు భూమ్మీద ఉండడం సృష్టి చేసుకున్న అదృష్టం - అనుకుందామె.

అతనిలో ఆమెకో మంచి స్నేహితుడు, అపురూపమైన ఆత్మీయుడు కనిపించారు. కకావికలమైన అతని మనసుకి స్వస్థత చేకూర్చాలని అనుకుందామె. అతన్ని పూర్తిగా కోలుకునే దాకా తన ఇంట్లోనే ఉండమని కోరింది. అతను సరేనన్నాడు.

"ముక్కూ మొహం తెలియని నామీద ఇంత ఆదరాభిమానాలు ఎందుకు చూపిస్తున్నారో నాకర్థం కావడం లేదు." అతను మళ్ళీ ఓ రోజు అడిగాడు.

"ముందు మీ కనుముక్కు తీరు, కళకళలాడే మీ మొహం నచ్చాయి.ఇపుడు మీ మనసు నచ్చింది."అందామె నవ్వుతూ-

"అసలు మీరెవరో ఏమిటో..."

* * *

శకుంతల ఓ పల్లెటూళ్ళో ఓ మధ్య తరగతి కుటుంబంలో పుట్టి పెరిగింది. చిన్నప్పుడే తండ్రి పోతే అన్నగారు పెంచి పెద్ద చేశాడు. గయ్యాళి అయినా వదినగారి ఆరళ్ళకి నిస్సహాయుడైన అన్నగారి అమాయకత్వానికి మధ్య ఆమె నలిగిపోయింది.

పెళ్ళీడు వచ్చేసరికి ఆమెకు పెళ్ళి చెయ్యాలని అన్నగారు భావించినా - "అంత డబ్బు మనమెలా ఖర్చుపెడతాం?" అని వదినగారు అడ్డపుల్ల వేసింది.

అతను ప్రయత్నం ప్రారంభించినపుడల్లా ఆమె అడ్డుపుల్ల వేస్తూనే ఉంది.

"ఇహ ఈవిడ నా పెళ్ళి జరగనివ్వదు. జీవితాంతం ఈమెకి, ఈమె పిల్లలకి చాకిరీ చేస్తూ బతుకు

చంద్రం ఆ ఊరి పంచాయతీ ఆఫీసుకి గుమాస్తాగా వచ్చాడు. అతనికి మొదటి చూపులోనే శకుంతల నచ్చింది. వెడల్పైన ఆమె కళ్ళు నచ్చాయి. గెడ్డం దగ్గరున్న పుట్టుమచ్చ నచ్చింది. ఆమె అమాయకత్వం నచ్చింది.
"నేను నిన్ను పెళ్ళి చేసుకుంటాను" అని ఆమెను చూసిన మూడో రోజునే అన్నాడు.

గడపాల్సిందే!" అని శకుంతల ఓ నిర్ణయానికి వచ్చిన సమయంలోనే చంద్రం పరిచయమయ్యాడు.

చంద్రం ఆ ఊరి పంచాయతీ ఆఫీసుకి గుమాస్తాగా వచ్చాడు. అతనికి మొదటి చూపులోనే శకుంతల నచ్చింది. వెడల్పైన ఆమె కళ్ళు నచ్చాయి. గెడ్డం దగ్గరున్న పుట్టుమచ్చ నచ్చింది. ఆమె అమాయకత్వం నచ్చింది.

"నేను నిన్ను పెళ్ళి చేసుకుంటాను" అని ఆమెను చూసిన మూడో రోజునే అన్నాడు.

ఆమె పులకించిపోయింది.

ప్రపంచంలో వదిన లాంటి రాక్షసులే కాదు - చంద్రం లాంటి దేవుళ్ళు కూడా ఉన్నారనిపించింది. తన జీవితం కొత్త దారిలో పయనించబోతున్నందుకు ఆమె ఆనందపడింది.

"వాడు మనకన్నా హీన కులం వాడు. వాడ్ని నువ్వు పెళ్ళి చేసుకుంటే రేపు నా పిల్లల పెళ్ళిళ్ళు అవ్వద్దూ?" అని వదినగారు బ్రేక్ వేసింది.

ఏం చెయ్యాలో శకుంతలకి అర్థం కాలేదు.

అన్నగార్ని సలహా అడిగితే "మీ వదిన ఈ జన్మలో నీకు పెళ్ళి కానివ్వదు. అతను మంచి వాడని నీకనిపిస్తే అతనితో వెళ్ళిపోయి పెళ్ళి చేసుకో. ఈ ఊళ్ళో మాత్రం ఉండొద్దు" అని చెప్పాడు. పైగా కొంత డబ్బు కూడా ఇచ్చాడు.

శకుంతల ఓ రాత్రి చంద్రంతో వెళ్ళిపోయింది. అతను మరో ఊరుకి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు.

వాళ్ళ జీవితం ఓ సంవత్సరం పాటు మూడు పువ్వులు, ఆరు కాయలుగా ఆనందంగా గడిచింది.

చంద్రం పనిచేస్తున్న ఊరు ముఠా కక్షలకి ఆలవాలం. అతను ఓ గ్రూపుకి సహకరిస్తున్నాడని మరో గ్రూపు వారు అతన్ని హత్య చేశారు.

శకుంతల దిక్కులేని మనిషైంది.

ఆ ఊళ్ళో బతకలేదు. తిరిగి అన్నగారి దగ్గరకు వెళ్లలేదు.అక్కడికి దగ్గర్లో ఉన్న పట్నానికి చేరుకుంది.

ఆ పట్నంలో పరమేశ్వరరావు పెద్ద కంట్రాక్టర్. రకరకాల వ్యాపారాలు, భూములు ఉన్న సంపన్నుడు. శకుంతల అతనింట్లో వంట మనిషిగా చేరింది. వంట చెయ్యడం, పిల్లల ఆలనా పాలనా చూడటం ఆమె బాధ్యతలు.

పరమేశ్వరరావుకి ఏభై ఏళ్ళుంటాయి. భార్య పోయింది. పిల్లలున్నారు. మళ్ళీ పెళ్ళి చేసుకుంటే పిల్లల్ని సవతి తల్లి ఇబ్బందులు పెడుతుందని పెళ్ళి చేసుకోలేదు.

పరమేశ్వరరావు శకుంతలని చాలా ఆదరంగా, అభిమానంగా చూసేవాడు. ఇంట్లో సభ్యురాలిలా గౌరవించేవాడు.

శకుంతల కూడా ఆ సంసారాన్ని చక్కగా చూసేది.

వాళ్ళిద్దరి మధ్యా అభిమానం రాను రాను అనురాగంగా మారింది. ఇద్దరూ ఎంతో కాలంగా ప్రాకృతమైన కోరికకు దూరంగా ఉన్నారు. అతను తన మనసులో కోరిక బైట పెడితే ఆమె అభ్యంతరం చెప్పలేదు. ఎంతో కాలంగా నిద్రాణంగా ఉన్న కోరిక ఇద్దరిలోను విజృంభించింది. వారిద్దరి మధ్య సంబంధం కొన్నాళ్ళు కొనసాగింది.

అతని పిల్లలు పెరిగి పెద్ద వాళ్ళయ్యారు. తమ తండ్రితో సంబంధం ఉందన్న విషయం గ్రహించిన పిల్లలు ఆమెను ఈసడించుకోవడం, చులకనగా చూడటం మొదలెట్టారు.

తన చేతుల్లో పెరిగిన పిల్లలు తనని అలా తక్కువగా చూడటం ఆమె భరించలేకపోయింది. అదే విషయం పరమేశ్వరరావుతో చెప్తే అతను బాధపడ్డాడు.

బాధపడి ఊరుకోలేదు.

అతను వ్యాపారం పనుల మీద నెలకి పదిహేను రోజులు హైదరాబాద్‌లో ఉంటాడు. అందుకని హైదరాబాద్‌లో శకుంతల పేరు మీద ఓ ఫ్లాట్ కొని ఆమెను అందులో ఉండమన్నాడు. ఆమెకు కావల్సినంత డబ్బు ఇచ్చి ఏ లోటూ లేకుండా చూసేవాడు. అతను తన ఊరికి, హైదరాబాద్‌కి మధ్య తిరుగుతూండేవాడు.

అలా కొన్ని సంవత్సరాలు గడిచింది.

అతనికి వృద్ధాప్యం వస్తోంది. రేపు తనకేదేనా జరిగితే శకుంతలని ఎవరు చూస్తారు? అన్న ప్రశ్న అతని మనసులో కదిలింది.

హైదరాబాద్‌లో తనకున్న వ్యాపారాల్లో ఒకదానితో తన వాటా ఆమెకి రాసిచ్చి ప్రతి నెలా ఆమెకి డబ్బు వచ్చే ఏర్పాటు చేసాడు.

ఆమెకే లోటూ లేదు.

కాని పరమేశ్వరరావు ఏర్పాటు చేసిన ఆర్నెల్లకే అతనికి పక్షవాతం వచ్చి మంచాన పడ్డాడు. అతని పట్నంలో తన పిల్లల దగ్గర ఉండిపోయాడు.

అతను హైదరాబాద్ రాలేదు. ఆమెను అతని పిల్లలు రానివ్వరు. ఆ రకంగా వాళ్ళ మధ్య బంధం తెగిపోయింది.

ప్రస్తుతం శకుంతల ఒంటరి పక్షి.

* * *

కథంతా విన్న రవికిరణ్‌కి శకుంతల మీద జాలేసింది. జీవితంలో అన్ని ధక్కామొక్కీలు తింది కాబట్టే ఆమెకు మనుషుల విలువ, జీవితం విలువ తెలిసి వచ్చిందనిపించింది.

రవికిరణ్ మానసికంగా కోలుకోవడానికి ఆమె అన్ని ప్రయత్నాలు చేస్తోంది. రోజూ సాయంత్రం ఇద్దరు కలిసి షికారుకో, పార్కుకో వెళతారు. ఆమె స్వయంగా వంట చేసి అతని దగ్గర కూర్చుని తినిపిస్తుంది.

కొద్ది రోజుల్లోనే అతను బాగా కోలుకున్నాడు.

ఓ రాత్రి భయంకరమైన ఒంటరితనం తనని బాధిస్తే అతను ఆమె మంచం మీదకు చేరాడు. ఆమె అతన్ని గుండెలకు హత్తుకుంది. ముద్దుల్లో ముంచెత్తింది.

అతన్ని తనలో ఐక్యం చేసుకుంది.

ఆనాటి నుంచి వాళ్ళిద్దరూ దంపతుల్లా కలిసి బతుకుతున్నారు.

అతను సాయంత్రం ఇంటికి వచ్చే సమయానికి ఆమె గుమ్మంలో ఎదురు చూస్తుంది. అతను ఇంట్లోకొచ్చేసరికి ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్చూస్తున్నట్టుగా అతన్ని అల్లుకుపోతుంది.

ఆమె అతని జీవితానికి కొత్త భాష్యం చెప్పింది. జీవితం మీద అనురక్తిని, అభిమానాన్ని కలిగించింది. అతనిలో కొత్త ఉత్సాహం నింపింది.

అతను తన పాత ప్రేమ కథను ఓ పీడకలలా మర్చిపోయాడు. ఆమె వల్ల అతను అన్ని సుఖాలు అనుభవిస్తున్నాడు.

ఆమెను ఇన్నాళ్ళు బాధించిన వంటరితనం దూరంగా పారిపోయింది. తన మనసులో మనసై, తన శరీరంలో శరీరమై, తన జీవితంలో ఓ భాగమై...

ఆమె ఆనందంతో తుళ్ళిపడుతోంది.

ఇలా ఓ ఆర్నెల్లు గడిచాయి.

ఓ రాత్రి-

శకుంతల రవికిరణ్ గుండెల్లో తలపెట్టుకుని పడుకుంది. అతని శరీరానికి అల్లుకుపోయి, అతుక్కుపోయి ఆనందిస్తోంది.

"రవీ - ఓ విషయం అడగనా?"

"అడుగు -అభ్యంతరం ఏమిటి?"

"మనిద్దరం - మనిద్దరం ఎప్పటికీ ఇలాగే ఉండిపోవాలి"

"అలాగే.. నీకా అనుమానం ఎందుకు వచ్చింది?"

"ఏంలేదు - మనం.. మనం..."

"చెప్పు - ఏమిటి?"

"మనం పెళ్ళి చేసుకుందాం రవీ!"

ఆ మాటలకి అతను చిన్నగా నవ్వాడు.

ఆమె లేచి కూర్చుని అతని మొహంలోకి సూటిగా చూస్తూ "ఎందుకలా నవ్వావు?" అనడిగింది.

"ఏంలేదు - నువ్వు పూర్వం రెండు సార్లు చేతులు మారావు. నీ జీవితంలో నేను మూడోవాణ్ని. నేను...నేను...నిన్ను పెళ్ళిచేసుకోవాలా?"

అతను గట్టిగా ఆ గది అదిరిపడేలా నవ్వాడు.

## పాఠక దర'హాసం'

* "ముష్టి నా కొడుకు' చిత్రంలో మీరు చాలా సహజంగా నటించారు. ఇంతకు ముందు మీరు ఏం చేస్తుండేవారు?" అడిగాడు విలేకరి.

"ఆc....జగదాంబ సెంటర్‌లో అడుక్కుంటుంటే ఈ నిర్మాత వచ్చి సినిమాలో నటించమన్నారు..." చెప్పాడు కొత్త హీరో.

* "మద్రాసు టూరు వెళ్లావటగా!? అక్కడ విచిత్ర వార్తలేమన్నా కన్నావా!" అడిగాడొక మిత్రుడు తన ఫ్రెండ్‌ను.

"మెయిన్‌రోడ్డులో పబ్లిక్‌గానే బ్రాందీ,విస్కీలు అమ్ముతున్నార్రా! ఒక్కో రోడ్డుకు వందేసి బార్లు వున్నాయి." చెప్పాడు ఆంధ్రాకు చెందిన ఆ మిత్రుడు.

* "మొన్న వచ్చిన తుపానుకు నేను పెంచుకున్న కోళ్లన్నీ నీళ్లల్లో మునిగిపోయాయిరా!" బాధగా చెప్పాడు వీరయ్య.



"అలా జరుగుతుందనే నేను బాతులను పెంచాను. చక్కగా అన్నీ నీళ్లలో తేలాయి. ఒక్కటీ చనిపోలా!" తెలివిగా చెప్పాడు పోలయ్య.

* డాక్టరు: బద్ధకం తగ్గటానికి నేనిచ్చిన టానిక్కు తాగుతున్నావా!?

పేషెంటు: టానిక్కు సీసా మూత తియ్యడానికే బోర్‌గా వుంది డాక్టర్!

* పేషెంటు: బాగా జలుబు చేసింది డాక్టర్!

డాక్టర్: ఎప్పట్నుంచీ?

పేషెంటు: నిన్న నా మిత్రుడు వచ్చి 'చల్లటి' కబురొకటి అందించాడు. అంతే!

డాక్టర్: ఆc...అలాగా! ఇంద ఈ బిల్లు కట్టి వెళ్లు. ఒళ్లంతా వేడి పుడుతుంది.

* తండ్రి: ఒరే చంటీ! ఎదురింటికి మీ అమ్మ వెళ్లివుంటుంది. నేను వచ్చానని చెప్పి వెళ్లి పిలుచుకురాపో....అదేంట్రా? ఎదురింటికి వెళ్లమంటే పక్కింటికి వెళుతున్నావ్?

చంటీ: ఏంలేదు. అమ్మ ఎదురింటి విషయాలు చెప్పడానికి ఈపాటికి పక్కింటికి వెళ్లుంటుందని!!

* "బద్దకం వదిలించకోవటం ఎలా! అన్న అంశంపై గ్రంధం రాస్తున్నావటగా. ఎంతవరకు వచ్చింది?"

"సంవత్సరంనుండీ రాస్తున్నా పది పేజీలైనా ముగించలేకపోయానోయ్!!" ఆవులిస్తూ చెప్పాడు బద్ధకిస్టు రైటర్.

* విలేకరి: మీకు సినిమాలో నటించాలనే ఐడియా రావడానికి కారణమేమిటో!?

నూతన నటి: మా ఫ్రెండ్స్ అంతా 'నువ్ విడిగా బావుండవు. మేకప్ వేసుకుంటే బావుంటావ్. నీది ఫోటోజెనిక్ ఫేసే.అన్నారంతా. అంతే.

* "సర్!! మన కంపెనీ సబ్బులు వాడితే ఒంటి నుండి భరించరాని వాసన వస్తుందని ఒకటే కంప్లెయింట్ సర్!!!"

"అలాగా! అయితే మూడు సబ్బులు కొన్నవారికి ఓ సెంటు సీసా ఉచితమని ప్రకటించేసేయ్."

* రోడ్డుపక్కన ఓ బురదగుంటలో పడిపోయిన ఓ అమ్మాయిని రక్షిస్తాడు ఒక యువకుడు. ఆమె కనీసం థ్యాంక్స్ అయినా చెప్పకుండా వెళ్లిపోతుండడం చూసి భరించలేని ఆ యువకుడు అన్నాడు-

" ఏమండీ! మిమ్మల్ని రక్షించానుగా. కనీసం థ్యాంక్సయినా చెప్పకుండా..."

"ఏంలేదు. థ్యాంక్స్ చెబితే మీరు నాతో పరిచయం పెంచుకోవడం, ఆ తర్వాత ఇద్దరం ప్రేమలో పడడం... ఏదంతా ఎందుకని!"

"అమ్మో చెప్పకండీ! ఈ ప్రేమగుంటలో పడితే నన్ను రక్షించే నాథుడే వుండడు!!"

* పేకాట ఆడుతున్న ట్రూప్‌లోంచి ఓ వ్యక్తి సడెన్‌గా లేచి వెళ్లడానికి ఉద్యుక్తుడౌతాడు. దానికి మిగతా వాళ్లంతా అభ్యంతరం పెట్టారు. అందుకు అతగాడు-

"లేదు. నేను పెళ్లికి వెళ్లాలి. ఇప్పటికే ఆలస్యమై పోయింది..."

"ఆc...వెళ్లావులే మహా! నువ్వు వెళ్లకపోతే అక్కడ పెళ్లే ఆగిపోతుందన్నట్టు ఫోజు..."

"హు...నేనేరా ఆ పెళ్లికొడుకును!" అదోలా చెప్పాడు అతను.

* భార్య: మొన్న మీరు కుట్టించుకున్న కొత్త చొక్కా బాలేదండీ!

భర్త: నిన్న తొడుక్కుంటే బావుందన్నావ్‌గా?

కొడుకు: డాడీ... ఈ రోజు ఇస్త్రీ చేస్తుంటే ఆ చొక్కా కాలిపోయింది!

* "మీ అమ్మాయికి ఎల్.ఐ.సి.లో ఉద్యోగం చేసే అబ్బాయి సంబంధం కుదిరిందటగా?...ఇంకా బెంగగా వున్నావేంట్రా?" అడిగాడు తన చిన్ననాటి స్నేహితుడిని సుబ్బారావు.

" ఏం కుదరటమో ఏమో!!.. పెళ్లికి వచ్చిన పిల్ల తరపువారందరిచేతా తలో లక్ష రూపాయల ఎల్.ఐ.సి.పాలసీలు చేయిస్తానని నా చేత మాట తీసుకున్నాడ్రా కాబోయే అల్లుడు!!" అసలు విషయం చెప్పాడు అప్పారావు బెంగపడిపోతూ.

**-గుగ్గిలం శ్రీహరి, వేటపాలెం**